అంకితం

★

శ్రీ రావూరి వెంకటసత్యనారాయణ

సందెకాబోతున్నది. ఆకాశం కారుమేఘాలతో నిండివుంది. మేడమీద కిటికీలో కూర్చుని వున్నది రేణుక. చాలా అందగత్తె. ఐశ్వర్యవంతుని బిడ్డ. ఆ కుబేరవంశంలో బంగారు నాణాల చప్పుళ్ళకు శ్రుతి కలుపుకొంటూ చిందులు త్రొక్కపడుచు.

కాని ముఖంలో సంతోషమే మీ కనిపించడం లేదు. ఆ సందెవేళ కిటికీలో అలాగే కూర్చుని ప్రకృతి నవలోకిస్తోంది. సందె గడిచిపోయింది. వెన్నెల షికారు బయలుదేరవలసిన చంద్రుడు, మబ్బులకు భయపడి కాబోలు రాలేదు. అందువల్ల దివ్యజ్యోత్స్నలో తాన మాడవలసిన ప్రకృతి మబ్బుల ముసుగు కప్పుకొంది. రేణుక హృదయాకాశంలో కూడ అలాటి మబ్బులే క్రమ్ముకొన్నాయి కాబోలు, సౌందర్యమంతా విషాదచ్ఛాయలతో నిండిపోయింది. కురులు ముడి వేయకుండా వదిలింది. పిల్లగాలుల కవి మెల్లగా ఊగుతున్నాయి. చూపులు పురిపిడి దారాలుగా తెగిపోతున్నాయి.

రేణుక చేతిలో కొన్ని గేయాలు గల వ్రాతప్రతి ఒకటి వున్నది. ఆమె దానివంక చూడటం లేదు. ఆకాశంవంకనే చూస్తున్నది. కళ్ల వెంట అశ్రువులు రాలుతున్నాయి. బయట చీకటికి తోడు చిన్న చిన్న తుంపరలు ప్రారంభమైనాయి. దూరంగా తోటపైన అంరవరకూ కనిపించిన ఇంద్రధనస్సు చీకటిలో అదృశ్యమైంది. "అతడు ప్రేమించాడు; గౌరవించాడు; మన్నించాడు; ఆనందించాడు, ప్రార్థించాడు, విలపించాడు, మరణించాడు" అన్న భావా లామె మనస్సులోకి వచ్చినాయి. ఆ ఏడు భావాలు ఇంద్రధనస్సులాగ వొళ్ళు విరుచుకున్నాయామెలో. కన్నీరు చేతిలోవున్న గ్రంథంమీద పడుతున్నది.

అప్పుడొకసారి గ్రంథంవంక చూచింది. అట్టమీద అంకితం అని వ్రాసివుంది. అవి అతని అక్షరాలే! ఎంత భక్తితో వ్రాశాడో! ఈ గ్రంథంలో ఎన్ని నిట్టూర్పులు, ఎంత నైరాశ్యంమూట గట్టాడో! ప్రేమించి జయించలేని ఆ హృదయం బాధనంతా ఒక్కసారిగా వెళ్లిగ్రక్కి, ఆవేడి పొగలు పీలుస్తూ 'ప్రేయసీ! ఈ కావ్యం చదువుతూ కృశించి నశించు' అని శపించి మరణించాడు కాబోలు: కాదు, కాదు, అతడు శపించడు; అలాటి కాఠిన్యత అతని మనస్సులో లేదు. తుదిఘడియ వరకూ పూజిస్తూనే వున్నాడు. తనను తానే శపించుకొన్నాడు. తనే ప్రేయసికొరకు కృశించి నశించాడు.

కవి హృదయం ఒకరిని శపిస్తుందా? పరుల కోసం ఆహుతి అవుతుందిగాని. ఆ కవి ప్రేయసి కోసం అలా ఆహుతి అయ్యాడు. కాదు ఆమె అతణ్ణి ఆహుతి చేసుకొన్నది. కవిని చంపిన పాపం!—మహాపాపం—'అబ్బా' అని రేణుక తలపట్టుకొంది. ఆమె మనస్సూ బయట ఆకాశం ఫెళ ఫెళా వురిమినాయి ఒక్కసారి. తలను అదిమి పట్టుకొని రోదిస్తున్నది. కన్నీటిజల్లు కురుస్తున్నది.

అంకితం అనేమాట మాత్రం ఆ చీకటి మనస్సులో మెఱుపులాగా దూసుకు పోతున్నది. ఎఱిగినంతవరకూ కవి జీవితాన్ని మనస్సు నెమరు వేస్తున్నది. ఆ బాధ ననుభవించలేక, ఒకసారి కళ్లు తెరిచింది. చూపులా గ్రంథంమీద పడ్డాయి. కానివాటికి కన్నీటిపొర లడ్డుపడ్డాయి. వాటిని తుడిచి వేసుకోలేకుండా వున్నది. ఆమె బ్రతుకే ఒక అశ్రుకణంగా మారి పోయింది. ఆ నీటి పొరలలోనుంచి గ్రంథంకూడ తెల్లటి మంచురేకుగా కనిపిస్తోంది. ఆమె దానివంకనే చూస్తున్నది. మనస్సు మాత్రం మళ్లీ వెనుకటి కథను మొదటినుంచి జ్ఞాపకం చేస్తున్నది.

తెల్లగా కనిపించే ఆ అట్టమీద ఒక పూరిగుడిసె బొమ్మ కనిపించిందామె కనులకు. అది వెన్నెల గాత్రి. ఒక కారువచ్చి ఆగుడిసె ముందు ఆగింది. ఒక పడుచు, స్నేహితురాల్ని వెంటబెట్టుకుని లోపలికి వెళ్లింది. రేణుక ఆదృశ్యాన్ని చూడలేక వెంటనే అట్టను త్రిప్పి వేసింది. అట్టవెనుక భాగంలో, గుడిసె లోపలిభాగం కనిపించింది. ఒక కుక్కిమంచంలో కూర్చుని వున్నాడు కవి. చింపిరి దుస్తులు, జేబుజుట్టు, వాపిరి కళ్ళు, కొడికట్టిన దీపం, వడివడిగా నడిచేకలం. ఇదీ ఆయన వర్ణన. పడుచులు రావడంచూచి ఆశ్చర్య

పడుతూ లేచాడు. 'రండి, రండి' అని వారిని కూర్చోమన డానికి ఏమి వున్నదా అని దిక్కులు చూడాడు. ఏమీ కనిపించ లేదు. చిన్న దేవదారు పెట్టెవున్నది మూల. చాలా సిగ్గుపడుతూ దాన్ని తెచ్చి వేశాడు. 'ఒకరు దీనిమీద కూర్చోండి' అన్నాడు. రెండో సీటుకోసం వెతుకుతున్నాడు. ఆ ఇద్దరిలో అందగత్తె అన్నది "ఫరవాలేదు. ఇద్దరం దీనిమీద కూర్చుంటాం లెండి" అని. అతను లోలోపల 'అమ్మయ్యా' అనుకొన్నాడు. ఆపడుచు అన్నది— "మీకు ధన్యవాదా లర్పించడానికి వచ్చాం. మీరు 'అవంతి' పత్రికలో 'జ్యోత్స్న' అనే శీర్షికతో వ్రాసిన గేయం చదివాం మహాకవులు మీరు, మీ దర్శనం చెయ్యాలని వచ్చాం."

"మీరు సరస్వతీ మూర్తులలాగా వున్నారు. లేకపోతే ఈ బీద కుటీరాన్ని వెతుక్కొంటూ ఎందుకు వస్తారు? నా జీవితానికీ రోజు పండుగ. కాని ఈకవి బీదతనానికి క్షమించాలి మీరు. మీకుతగిన స్వాగతం, ఆతిథ్యం ఇవ్వలేను" అన్నాడాకవి.

ఆ పడుచు చిరునవ్వు నవ్వుతూ, కొనగోటితో, అక్కడ కొడిగట్టివున్న దీపాన్ని దులుపుతూ అన్నది" అలా అనకండి, మీరు మహాకవులు. మీ కవితామృత వాహిని ద్వారా ఎలాటి స్వాగతాలిస్తున్నారు ప్రాణులకు? అమర కవిత్వాన్ని మించిన ఆతిథ్యంవున్నదా?

అతడు కొంచెం సంతృప్తి చెందాడు. ఆమె వంక చూడకుండా చూపులు వాల్చుకొని ఇలా అన్నాడు. "మీకు కవిత పైనగల అభిమానం అలాటిది. కాని నా కవిత వేరు, నేను వేరు అయినాం. కవితను జీవితంలో ప్రతిబింబింప చెయ్యలేక పోయాను. అయినా ఒక ధైర్యం మాత్రం వున్నది. పంకిలంలో నుంచిగాని పంకజం వికసించదు చీకటి అంచుల్లోగాని విద్యుత్తు మెఱియదు. అందువల్ల ఈ దారిద్ర్యం నా కవసర మేనని పిస్తున్నది" అన్నాడు.

"మీరు చెప్పింది నిజమే. కాని కవిదైవం, మహానుభావుడు. ద్రష్ట. అలాటి వారికి అవసరమైన సౌఖ్యాల నందించలేక పోవడం ప్రజల లోపం, మీరు ఓర్పు వహించవచ్చు; మిమ్మ చూచి ప్రజలు వోర్చడంలో అర్థంలేదు" అన్నదామె. "సుఖాలు ఈ జీవితంలో అడుగు పెడితే ఈ తపస్సు, ఈ ఆరాధన ఏమైపోతాయో నన్న భయంకూడా వుంది నాకు. అందువల్లనే దేనికీ అఱ్ఱులు జాచడంలేదు. ఈ కుటీరంలోనే ఇలా కుదించుకొని కూర్చున్నాను"

ఆమె అన్నది "ఇలాటి కుటీరాలే జాతికి వెన్నెల తేరాలు. ప్రజలకు తీర్థయాత్రలు. వీటిని మించిన వేమున్నయి?

అతడు పకపక నవ్వి "సరస్వతి నాకంటిలో వెన్నెలవత్తులు వేసి, నా ఇంట జేగంటలు మ్రోగిస్తున్న దివ్యాళి. మీకు నా ధన్య వాదాలు. మీ రెవరో తెలియ చెయ్యండి, జీవించివుండగా మిమ్మల్ని మరవను. మీ పేరేమిటి!—

"పేరు దేనికిలెండి. మీ శిష్యురాల్ని. ఈమెనా స్నేహితురాలు. నేను ... గారి కుమార్తెను. మాకు కవిత్వమంటే ఎంతో అభిమానం. మా జీవితాలకు కవిత్వం కానుకగా అందకపోయినా కవులనుదర్శించి పూజించాలనే ఆశతో జీవిస్తున్నాం. మీ వంటి వారి అనుగ్రహం...

"నీ పేరు చెప్పలేదు. కాని నిన్ను నేను 'కవిత' అని పిలుస్తున్నాను. కవి ప్రజలకూ, దైవానికి భృత్యులు. ప్రజాభీష్టం కోసం, ప్రజాభ్యుదయం కోసం జీవితాన్ని తపస్సుగా మార్చుకొని శాంతి సందేశాలను కవిత్వ వలయాలుగా లోకానికి కానుక అందించడానికే జన్మించిన జీవి కవి. నా అనుగ్రహ మంటున్నారా మీరు?—

'మీ ఆశయానికి ధన్యవాదలు. అమృతవాక్కులు వినిపించారు. వాటితో మమ్మల్ని ఐశ్వర్యవంతులుగా మార్చారు. అప్పుడప్పుడు మీదర్శనం చేసే అవకాశం ఇవ్వండి తరిస్తాం...

'ఈ కవి హృదయం, ఈ కుటీరపు తలుపు ఎప్పుడూ వోలవాకిలిగానే వుంటాయి. కవితలో ఆహ్వానం, స్వాగతం వున్నాయని నీవే అన్నావుగా కవితా!

'మీకవిత నమస్కరిస్తున్నది. ఈ జీవితానికి నాంది వాక్యాలు పలికారు, నామకరణం చేశారు. అమూల్యమైన మీ కాలాన్ని వ్యర్థపరిచాం స్వార్థంతో కాని..."

"చెప్పవమ్మా భయందేనికి ?—

"మీనోట ఒక్క గేయం వినందే, వెళ్ళడానికి మనస్సు వొప్పడంలేదు. నాలుగు పంక్తులు...

'ఇదేనా? కవిత ఇతరులకోసం కాకపోతే దాచుకోవడానికి టమ్మా!—వినిపిస్తాను.

"ఈవీణతీగలను
ఏరాణి మీటెనో
ఆత్మలన్నిటిలోన
అమృతవాహిను లుబికి
అలలుగా ప్రవహించె
అలరులై వికసించె ॥ఈ॥

కవిత విసరి వేసిన పూలమాలలాగా వచ్చి కవీం ద్రుల పాదాలపైన వ్రాలింది.

'స్వామీ ధన్యురాల్ని' అని ప్రార్థించింది. అతడు పాట ఆపివేశాడు. 'ఇదేమిటి నా పాదాలపైన వ్రాలావు? వాణి పాదాల నమ్మా మనమాశ్రయించ వల సింది. వీణతీగలను వదిలి కోయ్యను గౌరవిస్తున్నావు' అన్నాడు.

'ఆ తీగలను తనలో మేళవించుకొని విశ్వ మోహన గీతికలు వినిపించే కోయ్య మాత్రం వేరవు తుందా? ఈనాడు కవిరాజు పాదాలు అంటకలిగాను దీవించండి"

"వాణి దీవన లిదివరకే పొందావు. కవితవై నావు. ఇంకేమి దీవించనమ్మా"

"వెళ్లివస్తాను. ధన్యురాల్ని. తిరిగి దర్శనం చేస్తాను. మీ కాలాన్ని హరించి నందుకు క్షమిం చండి."

"కవి ఆశయాలను బ్రతికించావు. వెళ్లిరా."

"సెలవు, తిరిగి దర్శనం చేస్తాను."

ఆమె బయటకు వచ్చి కారులో కూర్చున్నది. అతడు కుటీరం గుమ్మంలో నిలబడి వున్నాడు. ఆమె విడువలేక విడువలేక వెళ్లింది. గొప్ప అనుభూతితో వెళ్లింది. జీవితంలోనుంచి మేల్కొని స్వప్నంలో నిద్రిస్తున్నట్లున్న దామెకు.

—కిటికీలో కూర్చున్న రేణుక మనస్సు ఇంత వరకూ వెనుకటి కథను స్మరించింది. భరించలేక పోయింది. ఒక నిట్టూర్పువిడిచి, పరధ్యాన్నంగా ఒక పేజీని త్రిప్పింది గ్రంథంలో. ఆ పుటలో చక్కగా అలంకరింపబడ్డ కవి కుటీరం కనిపించింది. ముస్తాబైన కవి కనిపించాడు. మెత్తటి సోఫాలో కూర్చుని వున్నాడు. పాలకాగితపు దొంతరలున్నాయి బల్ల మీద. మంచి పౌన్ టెన్ వున్నది. ప్రక్కన టీపాయ్ మీద పళ్లు, బిస్కత్తులు, ఫ్లాస్కులో టీ వున్నాయి. మంచి ఉలిపిరిదుస్తులు ధరించాడు. తల చక్కగా దువ్వుకొన్నాడు. కాళ్లకు సిల్కు చెప్పులున్నాయి. బిస్కత్తుముక్కలు నములుతూ, సెంటు జేబురుమాలు వాసన చూచుకొంటూ, పౌన్ టేన్ చేతపట్టి ఆలోచి స్తున్నాడు ఇంతలో బయట హారన్ మ్రోగింది... అతడు నవ్వుతూ ఎదురువెళ్లాడు. "ఇంత ఆలస్య మైందేం కవితా! నేనిందాకనే ముస్తాబై సిద్ధంగా వున్నాను నీవెంతకూ రాకపోతే 'నిరీక్షణ' అనే చిన్న గేయం వ్రాశాను.

ఆమె నవ్వుతూ ఇలా అన్నది. "సుఖదుఃఖాలు చీకటి వెలుగులు, ఆశానిరాశలు, ప్రణయ విరహాలు తపస్సులు,భగ్నాలు, ఆహ్వానాలు, వీడ్కోలులు ఈ అన్నిటినుంచి, అన్నిటి సమ్మేళనల నుంచి కవిత్వపు పూలు పూయించి మురిపించే కవులకు నేనూ ఒక అను భవాన్ని అందించా నన్నమాట!"అన్నది. అతడునవ్వు కొన్నాడు.ఇద్దరూ చేరి ఒక కుర్చీలో ఆసీనులైనారు. ఆ గుడిసె గోడలకు క్రొత్తగా వేసిన వెల్లకు మరింత వెల్లదనం వచ్చిందా నవ్వులతో. బీదతనపు పల్లాలలో నుంచి పైకుబికి పాలరాతి నర్తన శిలగా మారిన అతని హృదయంలో వాణి చేసే నృత్యంలాగా వినిపించి నాయి వారి పకపకలు. ఆమె బిస్కత్తు ముక్క త్రుంచి అతనికి అందించింది. ఆకలి మరచిపోయిన ఆ కవి దూతికా భోగానికి మాత్రం ఆశిస్తున్న వాని లాగా అందుకొన్నాడు దాన్ని. ఆమె ఫ్లాస్కులో టీ కొంచెం పోసి అందించింది. ఉత్సాహపు కొరత లేని ఆ కవి, దాని నొక ఉపాయనంగా స్వీకరిం చాడు. ఆమెలేచి కొంచెం దూరంలో వున్న పాన్ దాన్ అందుకొని కవటాకులకు కొనగోళ్లతో సున్నం రాస్తూ 'ఏదీ నిరీక్షణ?' అన్నది.

'సమక్షంలో నిరీక్షణ ప్రతాపమేమి తెలు స్తుంది కవితా' అన్నాడాయన. ఆకులకు ఈనెలు తీస్తు "నిరీక్షణను త్రుంచివేసేది సమక్షంలోనేగా?' అన్నది. అతడు పకపకనవ్వాడు 'అంత బరువుగా పాడలేనుగాని భావాన్ని మాత్రం వినిపిస్తాను' అన్నాడు.

'భావం తెలిస్తే బరువూ తెలుస్తుంది" అన్న దామె ఆకులమీద కవిరిపాడి విదిలిస్తూ. అతడు ప్రారంభించాడు—

ఈపరీక్షలి వేల!
ఈనిరీక్షణలేల?
ఈమూగచూపులో
ఇన్నియుగములుదొరిలి
నిట్టూర్పు కావ్యాల
గుట్ట పేర్చగ నేల?
అరచేతిలో వుసిరి
ఆమడలు కానేల?

కవిత పోకలు కత్తిరిస్తూ 'మీ కవనం ఆదర్శ శిఖరాలను వదిలి, ఆశల గూళ్లలో వ్రాలుతున్నదే వచ్చి' అన్నది. 'ఆశలే ఆశయా లవుతాయి. అనుభ వానికి దూరమై ఒకప్పుడు నిరాశలవుతాయి. ఇవన్నీ జీవితపు పల్లకీ కుచ్చులేగా' అన్నా డతడు.

'కుచ్చులే క్రూరసర్పాలుగా మారవచ్చునుగా ఒకప్పుడు.' అన్నదామె; వక్క అడకత్తెరనే వొత్తుతూ.

'సఫలమైన ఆశయాల్లో క్రూరసర్పాలూ కుచ్చులుగా వ్రేలాడుతాయి' అన్నాడతడు.

'ఆ భావానికి అగ్రతాంబూలమిస్తాను" అంటూ ఆమె తాంబూల మందించింది. అతడు సంతోషంతో తీసుకొన్నాడు. ఆమె కూడా తాంబూలం వేసుకొన్నది. 'మరి షికారు వెడదాము ఇక' అన్నది.

'నా ఆలస్యంలేదు' అంటూ లేచాడతడు. కారులోవున్న నౌకర్ని గుడిసెకు కాపలాపెట్టి వారు బయలుదేరారు. ఈ ఘట్టం కిటికీలో కూర్చునివున్న రేణుక మనస్సులో గ్రుచ్చుకొంది కాబోలు ఉలిక్కిపడింది. గాలికి పుస్తకంలో మరోపుట తిరగబడింది. గ్రంథాన్ని మూసివేద్దామనుకొంది కాని మనస్సు కథను ముందుకు నడుపుకొంటూ పోతున్నది. ఆ పేజీలో సముద్రపువొడ్డు, అలలు, ఇసుకదిబ్బలు కనిపించినాయి. కవి, కవితా అక్కడ కూర్చునివున్నారు. ఆమె ముంగురులు గాలికి కదులుతున్నయి. అపారసాగర దృశ్యమామె మనస్సును వూగిస్తున్నది. కవి సాగరం వంక చూస్తూ తిరిగి కవితపై చూపులు నిలిపాడు. ఆమె అన్నది మెల్లగా—

"నేను మౌనంగా కూర్చుంటాను. మీ భావాలను దండలు గ్రుచ్చండి. ఎంతో ప్రశాంతంగావున్నదిక్కడ."

"ఈ బీదకవిని గౌరవించి ఆరాధిస్తున్న నా కవితకే సమర్పిస్తానా దండలు" అన్నాడతడు.

"అలా అనకండీ. అమరజీవులైన కవుల నారాధించడం, దైవాన్ని అరాధించడంవంటిది. అందుకే మిమ్మల్ని సేవించి తరించాలనుకొన్నాను. మీరు నన్ను పూజించడం పొరపాటు."

"ఈ కవిపైన విశ్వాసం లేదా" అన్నాడతడు కాలిమీదకు ఇసుకను త్రోసికొని పిచ్చుక గూడుగా దానిని తిరుస్తూ.

'విశ్వాసమే మీ స్నేహితురాల్ని, శిష్యురాల్ని చేసింది."

అన్ని ధర్మాలపైనా విశ్వాసాన్ని కల్పించేదే కవిత్వం. అలాటి కవిత్వాన్ని వుపాసించినంత వరకూ విశ్వాసానికేమి కొరత వుంటుంది?' అని ప్రశ్నించిందామె. 'కవిత్వాన్నీ, వ్యక్తినీ వేరుచేసి మాట్లాడుతున్నావు కాదూ.' అని అతడు కాలు లాగివేశాడు, నిర్మించే పిచ్చుక గూడు తిరిగి ఇసుకలో కలసిపోయింది,

'కవిత్వంతో నిండిన వ్యక్తిత్వాన్ని ఎవరు వేరు చేయగలరు? ఆ వెలుగులోనుంచి బయటపడిన వ్యక్తిత్వాన్ని గూర్చిన ప్రశంస మనకెందుకు?" అన్నదామె.

అతడు తిరిగి సముద్రం వైపు చూస్తున్నాడు. దూరంగా ఎక్కడో ఒక తెరచాప కనిపించిది. తక్కినదంతా నీలపయోధి. పైన నీలగగనం ఉవ్వెత్తున లేచిన కెరటాలు వురుకులు పరుగులుగావచ్చి తీరాన్ని నురుగుగా మాత్రం తాకుతున్నాయి. కవిత మాత్రం కొంచెం భయంతో కూర్చునివుంది. 'ఇంటికి వెడదామా' అన్నది. అతడు పలుకలేదు. మళ్లీ ప్రశ్నించింది. పలుకలేదు.

'నేనేమైనా అపచారం చేస్తే క్షమించండి. గురుతుల్యులు గనుక నాభావాల్ని తెలియచేశాను. అవిధేయతగా భావిస్తే క్షమించండి" అన్నది. అతడామె వైపు చూచాడు. చిరునవ్వు పెదవులపైన విచ్చింది. 'ఎందుకు క్షమించడం. భావాలలో విభేదాలువస్తే నేరమా, ఒకరి భావాల నొకరు గ్రహించడమే స్నేహం. అది కాదు నే నాలోచించేది. ఈ విశాల సాగరం గంభీరమా! నీ హృదయం గంభీరమా' అని.

"ఎందుకీ పోలిక? ఆలిచిప్పలో నీటికి, అంబుధికీ సామ్యమా? ఉత్ప్రేక్షలు ఎదురుగా వున్నవారికి కాదు; స్వప్నసుందరులకు భావచిత్రాలకూ మాత్రమే" అన్నదామె. అతడు పకపక నవ్వాడు.

"కవితా! నేనిప్పటికే భావాన్ని గూర్చి వ్రాసినా, ఆలోచించినా, నీకూ వినిపించందే తోచడంలేదు. అక్కడనుంచి పైకి వెళ్లలేకుండా వున్నాను కూడా. నువ్వు పిలుపుదూరంలో వుంటే ఇంకెన్ని గేయాలు వ్రాసి వినిపిస్తానో అనిపిస్తున్నది. కాని......"

"మీరు నాకు గురువులు. మా తండ్రికీ అలాటి భావమే వుంది. వారితో చెపుతాను. మా ఇంటికి వచ్చెయ్యండి. మీకు కావలసిన సౌకర్యాలు చేస్తాను. నౌకరులుంటారు. మీరు వస్తే మా ఇంట సరస్వతి నృత్యం చేస్తుంది. అమర కావ్యాలు వెలువడుతాయి. వాటిని కళ్లకు అద్దుకొని జీవిస్తాను..."

"కవితపై నీ కెంత భక్తి త్యాగం వున్నాయి! అయితే రేపే వస్తాను. 'మునిమాపు' కావ్యం అక్కడే ప్రారంభిస్తాను" అన్నాడతడు.

"అలాగే."

ఇద్దరు తిరిగి కారులో ఎక్కారు. ఈ దృశ్యమంతా తిలకిస్తున్నది కిటికీలో కూర్చున్న రేణుక. కవిత అలా అంగీకరించడం పాపమైందా? అనుకొంటూ ఇంకొక పుటను త్రిప్పింది. కవిత మేడపైన

ఒక గదిలో కవి, కవితా కూర్చునివున్నారు. ఆమె తండ్రి కవితో ఇలా అంటున్నాడు. "మా తల్లికి కవిత్వమంటే ఎంతో ఇష్టం. బంగారు కలలు కంటుంది. మీరు మహాకవులు. మీరే మా అమ్మాయికి గురువులు. నేను ధనాన్ని సమకూర్చే తండ్రిని. మీరు విజ్ఞానాన్ని అందించే తండ్రులు" అన్నాడు.

కవి లోలోపల ఉలిక్కిపడ్డాడు. కవిత పకపక నవ్వుకొంది. తండ్రి చిరునవ్వుతో కవివంక చూచాడు. అతడు కూడా ఒక చిరునవ్వు బదులు పుచ్చుకొన్నాడు. అప్పు డిలా అన్నాడు. "మీ కుమార్తె నిజంగా వాణి. ఆమె శిష్యగాలు కావడం కంటె భాగ్య మేమున్నది! కవులను గుర్తించిన వంశం మీది. అందువల్ల నే నేనిక్కడకు రావడానికి అంగీకరించాను."

"మీ కరుణ ఇది. మీ కావ్యాలు మా ఇంట వెలువడడంవల్ల మా గృహం, మా జీవితాలు పవిత్రమవుతాయి." అని తండ్రి సెలవు తీసుకొని బయలుదేరాడు. కవివంక గౌరవంగా చూస్తూ కవిత "వస్తాను ఇప్పుడే" అని వెళ్ళిపోయింది. ఆమె వెళ్లడం కవికి ఇష్టంలేదు. వచ్చింది ఆమె సమక్షాన్ని అనుభవించడానికి. విసుగుతో అతడు లేచి పచార్లు ప్రారంభించాడు. నౌకర్లు నిముస నిముసానికీ వెళ్లి 'ఏం కావాలి' అని అడుగుతున్నారు. అత డేమీ వద్దంటున్నాడు. రాత్రి భోజనానికి తండ్రి వచ్చి పిలిచాడు. ఆకలిగా లేదని కవి అబద్ధమాడాడు. బ్రతిమాలాడు గృహస్థు. కాని కవి వినలేదు. కొంతసేపటికి కవిత వచ్చింది. 'భోజనానికి రండి, పస్తుండట మేమిటి' అన్నది. బ్రతిమాలింది. వినలేదు. పోనీ ఫలహారం తెస్తానంటూ వెళ్లింది. వద్దు వద్దు అని కవి కేకలు పెట్టాడు.

వెన్నెల వచ్చి వరండాలో పడింది. అక్కడ సోఫాలున్నాయి. బల్లమీద రోజాగుత్తు లున్నాయి. మేడక్రిందనుంచి రాత్రిరాణి వాసనలువస్తున్నాయి. కవి ఈ వాతావరణాన్ని అనుభవించలేకుండా వున్నాడు. ఇంతలో కవిత ఫలహారాలను తీసుకోని వచ్చింది. ఆమెవంక చూడలేదు కవి. ఆకాశాన్ని పరికిస్తున్నాడు. కవిత ను పాసిస్తున్నా డనుకొంది. కొంచెంసేపు కూర్చుంది. అప్పుడు "ఫలహారం తీసుకోండి" అన్నది. "నాకేమీ ఆకలి లేదు"అన్నాడు. "ఫలహారానికేం తీసుకోండి" అన్నది. పలకలేదు. 'తప్పవుంటే క్షమించండి. మీరు కోపంగా, విషాదంగావుంటే చూడలేదీ కవిత' అన్నది.

"ఎవరు కల్పించిన విషాద మిది?" అన్నా డతడు.

"నేనా! నావల్ల విషాదమా! చెప్పండి ఏమిటో అతిపవిత్రమైన మీ కవితకోసం, మీకోసం జీవితాన్ని అర్పిస్తాను. అందుకే మీవద్దకు వచ్చాను." అన్నదామె

"అవును వచ్చావు. పూరిగుడిసెలో తపస్సు చేసుకొనే నన్ను తీసుకొనివచ్చావు. నేను వచ్చింది తిండికోసమని రుజువుచేస్తున్నావు" అన్నాడు చివాలున లేచి పచార్లు ప్రారంభిస్తూ.

"ఆ! ఏమంటున్నారు! మీ తపస్సు భగ్నం చేశానా? నిజమా! తిండికోసమని రుజువు చేశానా? పొరపడుతున్నారు కవీజీ. మానవజీవితాలకు అమృతదానంచేసే మీరు ఆహారంకోసం ఆశించవచ్చారని నే ననుకొంటున్నానా! కవిత హృదయాన్ని వేరుగా అర్థంచేసుకోకండి. నాన్న చెప్పారుగా మా బిడ్డనని" అన్నది.

"అవును మరి, మీ సొమ్ము తినమనీ, మిమ్మల్ని కీర్తించమనీ కాదూ ఆయన వుద్దేశ్యం! కవి బీదతనంలో వున్నాడు గదా చెవిదగ్గిర నాణాలు మ్రోగించి, మిమ్మల్ని స్తోత్రం చేయించుకోవచ్చు ననుకొన్నారు కాదూ' అన్నా డతడు.

కవిత భరించలేకపోయింది, చివాలున లేచింది. ఫలహారం పళ్లెంక్రింద పడింది. "మీరు పొరపడుతున్నారు కవీజీ! ధనంతో కాదు మిమ్మల్ని ఆహ్వానించింది—ఆత్మలతో. కవితా-కవీ; వీటిలోగల పవిత్రతను కోరి తరించాలని ఆహ్వానించాం. మీ రెందుకు అపార్థందీశారో తెలియడం లేదు" అంటూ ఆమె వెనుక నిలబడి చెప్పుతున్నది. అతడు జవాబు చెప్పకుండా ఆకాశం వంక నే చూస్తున్నాడు. ఆమె తీరని బాధతో త్రొక్కిసలాడుతోంది.

ఆకాశంమీద తెలిమబ్బులు రెండు దగ్గిరికి వచ్చినట్లు వచ్చి దూరమవుతున్నాయి. ఒక నల్లమబ్బు ఎక్కడినుంచో వచ్చి చంద్రుణ్ణి ఆవరించింది. ప్రకృతి అంతా వెలవెలబోయింది. ఆ మసకవెన్నెల్లో నిలబడి కవి మనస్సును సరిచేసుకొంటున్నాడు. ఆమెవంక చూచి "కవితా! మన్నించు. ఒక తెలియని బాధతో మనస్సులా పలికింది. మధురమైన నీ హృదయాన్ని బాధపెట్టాను. నీ మేలు మరువనో కవితా! ఈ జీవితానికి నీవే ధ్రువతారవు" అన్నాడు. ఆమె రవంత శాంతించింది. తిరిగ ఫలహారం తెప్పించింది.

అతడు తింటున్నాడు "కవితా వీణమీద, 'ఏ రాణి మీ మెనో' అన్న పాటను వినిపించవు!" అని అడిగాడు. ఆమె అలాగే పాడుతున్నది. అతడు ఫలహారం చేస్తున్నాడు. పండువెన్నెల కాస్తున్నది.

—కిటికీలోవున్న రేణుక బయటికి చూచింది. చీకటి బాగా వ్యాపించింది. గాలిజోరు తగ్గి వీస్తు

న్నది. సన్నగా వీచే ఆ గాలికి పుస్తకంలో పేజీ మరొకటి తిరగబడింది.

ఆ పేజీలో ఈ దృశ్యం కనిపించింది. కవి సోఫాలో కూర్చునివున్నాడు. కవిత వచ్చింది. పాట వ్రాశానన్నాడు. పాడండి త్వరగా నన్నది కవిత. ఆమె ఆయనవెనుక వెళ్లి నిలబడింది. అతడు వెనుతిరిగి ఆమె కళ్లలోకి తొంగిచూస్తూ పాడుతున్నాడు—

"పొలయలుక లేమాయెనే చెలీ
ఈ అలుక లేలనే చెలీ!
నీ వలపు వెన్నెలలు
నిండి నవ్విన మనసు
ఈ మండు టెండలో
ఎండి మోడైపోవు - ||పొ||

కమ్మనీ కౌగిటా
కరగపోదము రమ్మ

"ఆపి వెయ్యండి పాట! పవిత్రభావ సంపదల నేరిమాలలు గుచ్చే మీకలమిలాటి నీచ భావాలనందుకోవడం నా కిష్టంలేదు" అన్నదామె అక్కడనుంచి దూరంగా వెడుతూ.

"ఇష్టం లేనివారికే ఇది అంకిత మిస్తున్నాను" అన్నాడతడు కులుకుతూ.

"ఆత్మ నలరించని అంకితాన్నెవరూ అపేక్షించరు" అన్నదామె.

"అంకితం చేసే ఆత్మలే అందుకొంటాయి భావాన్ని' అన్నాడతడు.

"ఆత్మల కవిద్రోహం, అవమానం."

"ప్రణయం అవమానం కాదు.—

"కోరని ప్రణయం తీరని అవమానం

"కోరడం కూడా నేర్పే—"

"కోరిక బలవంతంతో కూడింది కాదు—

"హృదయాన్ని దాచడంకూడా పాపమే"

"అలాంటి పాపం అనుభవించేవారికి పరితాపం తప్పదు—

"పవిత్రమైన ఆత్మల్ని వేరుచెయ్యడం ధర్మం కాదు.

"పవిత్రతకు తుచ్ఛపు చీకటి కప్పడం మరీ అధర్మం."

"కవితా! నన్ను అవమానిస్తున్నావు."

"కాదు, దైవంగా భావించి పూజిస్తున్నాను."

"ధిక్కరించి, వెక్కిరిస్తున్నావు."

"కాదు మహాకవులని మొక్కుతున్నాను."

"నా కోరికను..."

"కవీజీ! ఆపివెయ్యండి' అంటూ ఆమె చరా చరా క్రిందికి వెళ్లిపోయింది. కవి వేడి నిట్టూర్పులు విడుస్తున్నాడు.

—కిటికీలో రేణుక మనస్సు ఆవేశంతో నిండి వుంది. భరించలేకపోయిందీ కథా భాగాన్ని. బయట గాలి ఎక్కువవుతున్నది, పేజీలు త్వరత్వరగా తిరుగుతున్నాయి గ్రంథంలో. తరువాత పుటలో ఈదృశ్యం కనిపించింది.

"కవితా! నా హృదయాన్ని అర్థంచేసుకో. ఒక మూల పడివున్నవాణ్ణి, వచ్చి ఆహ్వానించావు. ఆకర్షించావు. ధనానికి సంబంధించిన గౌరవాలు కల్పించావు. మీ సేవకు జీవితాన్ని అంకితం చేస్తానన్నావు. నీ సౌందర్యాన్ని కోరుతున్నది మనస్సు. నన్నీ తృష్ణలోపడవేసి ఇప్పుడు...

"కవీజీ! మీ పాదార్చన కోరుతున్నాను. మీ కల్యాణ గీతికల్ని కోరుతున్నాను. మీ ఆత్మజ్యోతిని కోరుతున్నాను. కవిని పాపకూపంలో పడవేసే నీచదశను కాదు నేను కోరేది.

"కవిని ప్రేమించకపోవడం మహా పాపం సుమా."

"మీరు పొరపడుతున్నారు. ఈ ఒక్క భావాన్ని వదలండి. మీ ఆజ్ఞలను శిరసావహిస్తాను."

"నా కోర్కె మన్నించు, తరువాత నీ ఆజ్ఞలన్నిటినీ పాలిస్తాను."

"అసంభవం..."

"అవమానిస్తున్నావు కవిని."

"గౌరవంగా జీవిద్దామని ప్రార్థిస్తున్నాను."

గాలికి గ్రంథంలో పుట మరిఒకటి తిరగబడింది. అక్కడి దృశ్యమిలా కనిపించింది రేణుకకు.

కవి వంటరిగా కూర్చుని పాడుకొంటున్నాడు. ఇంతలో కవిత వచ్చింది.

మోసమని పాడుతున్నారేమిటి? ఆ పాట ఆపివెయ్యండి. మరి రేపు మీ పుట్టినరోజన్నారు కాదూ! నాన్నతో చెప్పాను; కవిపూజకు, సన్మానానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

"ఇలాటి ఆర్భాటాలతో నన్ను మోసం చెయ్యాలనుకొన్నారా! హృదయం లేని పూజలా? నా పుట్టినరోజు కానుక నాకవిత"

"కవిత కాదు కానుక—ఆమె సేవ."

"మీసన్మానాలు నాకక్కరలేదు."

గాలికి గ్రంథంలో మరి ఒకపుట రేగింది రేణుక చలించిపోతున్నది. గజగజ వణుకుతున్నది. ఆ పుటలో దృశ్యమిలా కనిపిస్తున్నది—కవి బయలు దేరాడు వెళ్ళిపోవడానికి. కవిత మెట్లమీద అడ్డంగా నిలబడివున్నది. వెళ్ళవద్దు. ఈ కవిత జీవించదు. మీ పాదసేవ చేసుకొని జీవిస్తాను. మీ కోరిక తిరస్క రించినందుకు మన్నించండి. కవిని వేయివిధాల సేవి ద్దామనుకొన్నాను. కాని కవిత మీకెంత విషాదం కల్పించింది. నా వయస్సు నాకే అర్థమైనది. దీనిలో పాపం వుంటే నేనే భరిస్తాను. మన్నించండి. రేపు పూజకూడా..."

"కవితా! నా హృదయంలో అగ్ని రగులుతు న్నది. వేయి సన్మానాలుకూడా దీన్ని ఆర్పలేవు. నీ సౌందర్యాన్ని సమర్పించు. పాపమైనా, భాగస్వా ముల మవుదాం."

"స్త్రీ అంటే కామమేననా మీ అర్థం"

"పురుషుడు లేని స్త్రీ, స్త్రీ లేని పురుషుడు వ్యర్థమని నా అర్థం"

"ఉభయులు కోరవద్దా మరి"

"మన సాంప్రదాయమది కాదు."

"సాంప్రదాయాలమాట కాదు సత్యం చెప్పండి"

"నిన్ను కోరడం సత్యం."

"అసంభవం."

"కవితా!"

"అవును కవీజీ."

"అయితే వెళ్ళిపోతున్నాను."

"కవితను మీ పాదాలతో నలిపి వేసి వెళ్ళండి."

"నీ సౌందర్యంతో నాగుండెల నిదివరకే నలచి వేశావు—వెడుతున్నాను."

"వద్దు! వద్దు"

—మరి ఒక పుటలో దృశ్యం. కవి విసురుగా నడిచి వెళ్ళిపోతున్నాడు. ఆమె కన్నీటితో గుమ్మ ములో నిలబడివుంది. అతడు వీధి వెంట వెళ్ళిపోతు న్నాడు—కవి తనుకు దూరమవుతున్నాడు.

మరి ఒకపుటలో దృశ్యం. తండ్రి కవితను అడిగాడు "ఏదమ్మా కవి!"

"వెళ్ళిపోయాడు"

"ఎందువల్లా!"

(మౌనం)

మరి ఒకపూట. కవిత అర్ధరాత్రివేళ వెన్నెలలో కూర్చుని వీణ మీటుతున్నది. కన్నీటి ముత్యాలు రాలుతున్నాయి. మరికొన్ని పుటలు ఒక్కసారిగ ఎగిరినాయి. రేణుక వెనుక అట్ట లోపలి భాగాన్ని చూస్తోంది. అక్కడి దృశ్యమిలా కనిపించింది.

"కారు గుడిసెముందు ఆగింది. కవిత దిగి గుమ్మంలో నిలబడింది. కవిని తాను మొదటదర్శించి నప్పటికంటే దీన దశలో మంచం పట్టివున్నాడు. అతని బీదగొంతులోనుంచి ఒకపాట, తెగి ముక్క లుగా వినిపిస్తోంది.

ఏ సుఖంబులు లేని
ఈ సుకవి బ్రతుకులో
ఏల ప్రాలితి వీవు?
పూల రెక్కలు జాచి
ఏల విసరితి వీవు?
మురిపించి నవ్వించి
మరిపింప జూతువా!
స్వర్గమ్ము రమ్మంచు
నరకమ్ములో ద్రోతువా!

కవిత ఆపాట విని దుఃఖిస్తూ ఆయన దగ్గిరకు వెళ్ళింది. దగ్గిర కూర్చుని—

"కవిజీ! క్షమించండి"

"ఎవరు!"

"నేను రేణుకను—కాదు మీ కవితను"

"అవునిప్పుడు రేణుకవే! నా కవిత రేణుకగా మారిపోయింది. సహాయానికి వచ్చావు రేణుకా! అబ్బా"

"కవీజీ! మీ కవితగానే వచ్చాను. ఏమిటిలా వున్నారు? కళ్లు అలా మూస్తున్నారేం! నేను వచ్చాను కవిజీ"

"అవును వచ్చావు, సమయానికి వచ్చావు. ఇప్పుడే అనుకొన్నాను నీ మాట!...అబ్బా!—"

"ఏమిటి మూలుగుతున్నారు? ఇలా అయిపోయి నారేం! క్షమించండి, ఈ పాపం నాదే, మీతో ఒక్కమాట చెప్పాలని వచ్చాను."

"ఏమిటది? త్వరగా చెప్పు"

"ఆనాడు మీ కోరిక మన్నించలేకపోయాను. ఆ కోపంతో మీరు వచ్చేశారు. తరువాత ఎంతో విచారపడ్డాను. చివరకు నా మనస్సు చెప్పింది— "మహాకవిని మించిన ప్రియుడెవడు లభిస్తాడు, ఆయన వద్దకే వెళ్లు" అని. అందుకని పరుగెత్తుకు వచ్చాను.

ఆలస్యానికి క్షమించండి. కవిత జీవితాంతరం వరకూ మీ నీడలో నిలుస్తుంది."

"అబ్బా !"

"ఏమిటది !"

"నువ్వు ఆలస్యం చెయ్యలేదు. సమయానికే వచ్చావు. నీదగ్గరనుంచి వచ్చినప్పటినుంచీ నిరాహార దీక్షతో నీ కోసం ఈ కావ్యం వ్రాశాను. ఇదంతా నా ఆత్మకథ. ఓపిక లేకపోయినా పట్టుదలతో పూర్తి చేశాను. వ్రాయలేక వ్రాయలేక ఇప్పుడే చివరి గేయాన్ని ముగించాను—నువ్వువచ్చావు."

"అయ్యో! నా కోసం వ్రాశారా? నిరాహార దీక్షతో నా!... లేవండి, ఆహారం తీసుకొందురు గాని—"

"అబ్బ! ఆ... హా ... ర ...మా ! ఈ కావ్యం...తీసుకో...నీకు—అంకిత మిచ్చాను. ఆ గేయం ఒక్కటీ చదువు వింటాను"

కవిత గ్రంథం తీసుకొని అతి దుఃఖంతో చదువుతోంది—

వలదు వల దీ
పాడు లోకము
వలదు వలదీ
వలపు ముచ్చట
కాలమెవ్వని
కరవు దీర్చెను
ప్రణయమెవ్వని
బాగు చేసెను
గగన కుసుమములు
గావె సౌఖ్యము లెంచగాన్

ఆమె కన్నీరు గేయం పైన కురుసింది.

"విూహృదయాన్ని చాలా బాధపెట్టాను కవీజీ" అన్నదామె. అతను పలకలేదు. మళ్ళీ పిలిచింది. పలకలేదు. చెయ్యిపట్టుకొని 'కవీజీ' అని కుదిపింది. ఆమె ఒక్క కేక పెట్టింది.

—రేణుక ఇలా కవిత పేరుతో నడచిన తన కథంతా స్మరించింది. ఉలిక్కిపడింది. గ్రంథాన్ని మూసివేసింది. వెనుక అట్టమీద తానిలా గ్రంథాన్ని చేతులలో పెట్టుకొని దుఃఖిస్తున్న దృశ్యం కనిపించింది. బయట గాలి తగ్గి వర్షం ఎక్కువైంది. ఆమె కన్నీటితో గ్రంథం తడిసిపోతున్నది. అంకిత మిచ్చిన గ్రంథాన్ని అశ్రువులతో పూజిస్తున్నది - కవిత పేరిటి రేణుక.